క్లుప్తంగా

ఫ్లోరోసిస్ బాధితులకు కిట్లు పంపిణీ



కె.వెంకటాపురంలో రోగులకు కిట్లు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

కోటవురట్ల : పౌష్టికాహారం ద్వారా ఫ్లోరోసిస్ నుంచి తప్పించుకోవచ్చని ప్రోగాం ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి అన్నారు. కె.వెంకటాపురంలో ఫ్లోరోసిస్ బాధితులకు సోమవారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్షిత మంచినీరు, ఆహారం పట్ల తగు జాగ్రత్తలు తీసుకుంటే ఫ్లోరోసిస్ నివారణ సాధ్యమన్నారు. అనంతరం 24 మందికి నెక్ బ్యాండ్లు, 125 మందికి వాకింగ్ స్టిక్స్, 72 మందికి వాకర్స్, 55 మందికి ల్యాంబర్ బెల్టులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్సల్టెంట్ డాక్టర్ విశ్వనాథం, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సంతోష్‌కుమార్, ఎంపీహెచ్‌ఈవో గోవిందరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి



కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఈవోఆర్డీ చంద్రశేఖర్

పాయకరావుపేట : మండలంలో ఆయా గ్రామాల్లో గ్రామ కార్యదర్శులు పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఈవోఆర్డీ సిహెచ్.చంద్రశేఖర్ కార్యదర్శులకు సూచించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, నీటి గుంటలపై బ్లీచింగ్ వేయించాలని, రహదారులపై చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై వినతుల స్వీకరణ

మునగపాక : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ఎంతగానో దోహదపడుతుందని తహసీల్దార్ పాపారావు తెలిపారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సమస్యలతో పాటు రైతులకు అవసరమయ్యే సేవలను అందిస్తామన్నారు. అలాగే ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. రీ-సర్వేలో లోపాలను సవరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీటీ వినయ్ పాల్గొన్నారు.

సంపద కేంద్రాలతో అదనపు ఆదాయం



తిమ్మరాజుపేటలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోఆర్డీ వెంకటలక్ష్మి

మునగపాక : సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఈవోఆర్డీ వెంకటలక్ష్మి అన్నారు. తిమ్మరాజుపేటలో సంపద తయారీ కేంద్రాన్ని ఆమె సోమవారం సందర్శించారు. కేంద్రాల్లో తయారయ్యే వర్మి కంపోస్టు ద్వారా మంచి ఫలితాలు సాధించాలన్నారు. గ్రామంలో రక్షిత మంచినీటి పథకాన్ని కూడా పరిశీలించారు.

రైతు సేవా కేంద్రం సందర్శన



ఖరీఫ్ వరి నారుమళ్లను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి స్వప్న

కశింకోట: మండలంలోని నూతలగుంటపాలెంలో రైతు సేవా కేంద్రాన్ని సోమవారం మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.స్వప్న సందర్శించి రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. వ్యవసాయ యాంత్రీకరణ కేంద్రంలోని వ్యవసాయ పనిముట్లను పరిశీలించారు. అనంతరం నూతలగుంటపాలెంలో రైతులు నాటిన ఖరీఫ్ వరి నారుమళ్లను ఆమె పరిశీలించి, వాటి సస్య రక్షణ మెళకువలను రైతులకు వివరించారు. వ్యవసాయ సహాయకుడు మధు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు బాబూ?

- ఉద్యోగాల నోటిఫికేషన్ ఎప్పుడు..
- ఆశగా ఎదురు చూస్తున్న నిరుద్యోగులు

'మా ప్రభుత్వం వస్తే 20 లక్షల ఉద్యోగాలిస్తాం...
జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం....
స్కిల్ సెన్సస్ చేపట్టి నైపుణ్యం పెంపునకు కృషి చేస్తాం...
నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు చొప్పున చెల్లిస్తాం...'
కూటమి పార్టీలు యువత కోసం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన అంశాలివి.. తమ ఎన్నికల మేనిఫెస్టో సూపర్ సిక్స్‌లో ప్రధానంగా నిరుద్యోగుల గురించే ప్రచారం చేశారు. కానీ అధికారంలోకి వచ్చాక సీఎంగా ప్రమాణస్వీకారం రోజున చంద్రబాబు పింఛన్ల పెంపు మినహా మరే అంశాన్ని పట్టించుకోలేదు. జాబ్‌క్యాలెండర్, నిరుద్యోగ భృతి గురించి నిరుద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్నారు. తమకు ఇచ్చిన హామీలపై చంద్రబాబు స్పందించాలని కోరుకుంటున్నారు...



నక్కపల్లి : ఎన్నికలకు ఆరు మాసాల ముందు నుంచే టీడీపీ నాయకులు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, పింఛన్ల పెంపు, ఆడ బిడ్డనిధి, ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమంది చదువుకునేందుకు తల్లికి వందనం పేరుతో ఏటా రూ.15 వేలు చెల్లిస్తామని, మహిళలందరికీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని, 50 ఏళ్లు దాటిన బీసీలందరికి నెలకు రూ.4వేలు చొప్పున పింఛన్లు అందజేస్తామని, అలాగే 18 నుంచి 59 ఏళ్ల లోపు మహిళలందరికి నెలకు రూ.1500 చొప్పున చెల్లిస్తామని రైతు భరోసా కింద ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తామంటూ ప్రచారం చేశారు. సూపర్‌సిక్స్ హామీల్లో 20 లక్షల ఉద్యోగాలనే ప్రధానంగా ప్రచారం చేశారు. జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పారు. కూటమి పార్టీల హామీలను నమ్మి ప్రజలంతా ఓట్లేసారు. సీఎంగా ప్రమాణస్వీకారం రోజున చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీల్లో పింఛన్ల పెంపునకు సంబంధించిన జీవోపై మాత్రమే సంతకం చేశారు. ఒకటో తేదీన పెంచిన పింఛన్లు పంపిణీ చేశారు. మిగిలిన హామీల్లో ప్రధాన మైనది లక్షలాది మంది నిరుద్యోగులు ఎదురు చూస్తూ ఆశపడ్డ జాబ్ క్యాలెండర్‌పై కాని, నిరుద్యోగ భృతిపై గాని ఎటువంటి ప్రకటన చేయలేదు. గతంలో 2014-19 మధ్యకాలంలో కూడా చంద్రబాబు ఇదే హామీ (నిరుద్యోగ భృతి) ఇస్తానని చెప్పి మోసం చేశారు. ఒక్కరికి కూడా నిరుద్యోగ భృతి చెల్లించలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు అవుతున్నా దీనిపై ప్రకటన చేయకపోవడంతో ఇప్పుడు కూడా అదే మోసం చేస్తారేమోనన్న అనుమానాలు నిరుద్యోగుల్లో వ్యక్తమవుతున్నాయి.

గత ప్రభుత్వంలో దాదాపు 3 లక్షల ఉద్యోగాల భర్తీ

గత ప్రభుత్వంలో దాదాపు 2 లక్షలకు పైగా సచివాలయ ఉద్యోగ నియామకాలు చేపట్టింది. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి మరో లక్షకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసింది. నక్కపల్లి మండలంలో మొత్తం 32 పంచాయతీల్లో సుమారు 26,500 నివాస గృహాలు ఉన్నాయి. సగటున 6 వేల మందికి పైగా నిరుద్యోగులు ఉన్నారు. వీరిలో పదో తరగతి నుంచి డిగ్రీలు, డిప్లొమా కోర్సులు, ఐటీఐ, అలాగే వృత్తి విద్యాకోర్సులు పూర్తి చేసిన వారు ఉన్నారు. వీరంతా ప్రస్తుతం ఎటువంటి ఉద్యోగాలు లేక స్థానికంగా స్వయం ఉపాధి పొందడం, లేదా వ్యవసాయాధారిత పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన 20 లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.3వేల చొప్పున ఇస్తామన్న నిరుద్యోగ భృతిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు గడుస్తున్నా సరే నిరుద్యోగ భృతిపై స్పష్టమైన ప్రకటన చేయలేదు. ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఎటువంటి ప్రకటన, నోటిఫికేషన్‌గాని విడుదల చేయలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారు, ఎవరికి ఇస్తారు, ఎలా చెల్లిస్తారు, ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు ఏమిటి అనేది తెలియజేయాలని కోరుతున్నారు.

మేనిఫెస్టో కార్యరూపం దాల్చేనా...

అచ్యుతాపురం : పారిశ్రామికవాడ కేంద్రంగా ఉన్న నియోజకవర్గం యలమంచిలి. రెండు మండలాల్లో పరిశ్రమలు స్థాపించినా స్థానికంగా కొందరికే ఉపాధి కలిగింది. వ్యవసాయ భూములు తగ్గిపోవడంతో ఈ ప్రాంతంలో నిరుద్యోగ సమస్య పెరిగింది. ఇరవై ఐదు వేల నుంచి యాభై వేల వరకూ నిరుద్యోగ సమస్య ఉన్న ఈ ప్రాంతంలో కొత్త ప్రభుత్వం వచ్చాక యువకులు మరిన్ని ఆశలు పెట్టుకున్నారు. ఒకవైపు ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని ఇచ్చిన హామీకి ఇంకా కదలిక రాలేదు.

గత ప్రభుత్వంలో స్థానికులకే 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలన్న ప్రతిపాదన పూర్తి కార్యరూపం దాల్చకుండానే కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. తాజాగా **కూటమి ప్రభుత్వ మేనిఫెస్టో, హామీల అమలు కోసం ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నట్లు నిరుద్యో**గులు కూడా ఎదురు చూస్తున్నారు.

ఇంటికో ఉద్యోగం ఇవ్వాలి...



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం ఇంటికో ఉద్యోగం , లేదా నిరుద్యోగ భృతి ఇస్తానన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగాల కోసం, నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నాం . సత్వరమే అవకాశం కల్పిస్తారని ఎదురు చూస్తున్నాం.

-దాడి సురేష్ , బీటెక్, పాయకరావుపేట

మాట తప్పకూడదు



ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఇంటికో ఉద్యోగం కాని, నిరుద్యోగ భృతి గాని వీలైనంత త్వరగా అమలు చేయాలని ఎదురు చూస్తున్నాం.

-కాకాడ కృష్ణ, నిరుద్యోగి, గజపతినగరం, పాయకరావుపేట

గౌరవ వేతనం ఆపేశారు.. భృతి ఎప్పుడు ఇస్తారో...



జగనన్న ప్రభుత్వంలో గ్రామంలో వలంటీర్‌గా చేరి నెలకి రూ.5 వేలు గౌరవ వేతనం పొందే వాడిని. రెండు నెలలుగా ఆ నగదు రాలేదు. చంద్రబాబు ఎన్నికల్లో గెలిస్తే ఉద్యోగ కల్పన లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తాను అన్నారు. వెంటనే అమలు చేసి నిరుద్యోగులను ఆదుకోవాలి.

-చెక్కా అరుణ్‌కుమార్, తిమ్మాపురం (ఎస్.రాయవరం)

నిరుద్యోగులను ఆదుకోవాలి



ఎన్నికల హామీలను సీఎం చంద్రబాబునాయుడు అమలు చేయాలి, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేకుంటే భృతి ఇస్తామంటూ ఇచ్చిన హామీని నెరవేర్చాల్సిన బాధ్యత చంద్రబాబుదే. నిరుద్యోగులను ఆదుకోవాలి. అవకాశం ఉన్న యువతకు ఉద్యోగ ఉపాధి కల్పించాల్సి ఉంది. లేదా నెలకు నిరుద్యోగ భృతి అమలు జరిగేలా చూడాలి. చదువును బట్టి ఉద్యోగం దక్కేలా చర్యలు తీసుకోవాలి.

-ఇల్లా సంతోషి, కాకరాపల్లి (మునగపాక)

భృతి కోసం ఎదురు చూపులు



ఇంజినీరింగ్ పూర్తి చేశాను. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి నెల రోజులు గడుస్తున్నా ఈ పథకానికి సంబంధించి ఇంకా ఎటువంటి ప్రకటన చేయలేదు. వెంటనే కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయాలి, అప్పటి వరకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి చెల్లించాలని కోరుతున్నాను.

-రాజ్‌కుమార్, నిరుద్యోగి, నక్కపల్లి

హామీ వెంటనే నెరవేర్చాలి



ఎన్నికల ముందు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి మంచి హామీ ఇచ్చింది. అది నమ్మి కూటమికి ఓటేశాం. నా వయస్సు 34, నేను బీఎస్సీ పూర్తి చేసి ఏ ఉద్యోగం లేక ఖాళీగా ఉన్నాను. కుటుంబ పోషణ కష్టంగా ఉంది. ఉద్యోగం కల్పిస్తామని, లేకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి హామీ ఇచ్చింది. కాబట్టి వెంటనే భృతి చెల్లించాలని కోరుతున్నాను. ఎపుడు ఇస్తారోనని ఎదురు చూస్తున్నా..

- గెడ్డం రమణ, నిరుద్యోగి, కె.వెంకటాపురం, కోటవురట్ల మండలం

జాప్యం వద్దు...



నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటింది. ఇంకా దాని గురించి కూటమి ప్రభుత్వం ఏం చెప్పడం లేదు. ఎపుడు ఇస్తారో తెలీక అయోమయంలో ఉన్నాం. మా ఊళ్లో చాలా మంది నిరుద్యోగులు ఉన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన వలంటీర్లు కూడా ప్రస్తుతం ఉపాధి లేక ఖాళీగా ఉన్నారు. మేమంతా నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నాం.

- రామసత్యనారాయణ, నిరుద్యోగి, కె.వెంకటాపురం, కోటవురట్ల మండలం

ఎన్నికల గిమ్మిక్కు కారాదు...

కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తామని నిరుద్యోగులకు ఆశ చూపింది. ప్రభుత్వం కొలువు దీరి నెల రోజులు దాటింది. ఇచ్చిన హామీ మేరకు తక్షణమే నిరుద్యోగుల జాబితా తీసుకొని భృతి ఇవ్వాలి. నిరుద్యోగ భృతి హామీ ఎన్నికల గిమ్మిక్కు కారాదు. అదే జరిగితే నిరుద్యోగుంతా కలిసి ప్రభుత్వంపై ఉద్యమిస్తాం.

-యు.జగన్, పూడిమడక

ఉత్తమ ఫలితాలు రాబట్టాలి..



కేజీబీవీ విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎస్‌డీడీ రమణ

కోటవురట్ల : ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సర్వశిక్షా అభియాన్ స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.డి.వి.రమణ సూచించారు. స్థానిక కేజీబీవీని జీసీడీవో పద్మావతితో కలిసి ఆయన సోమవారం తనిఖీ చేశారు. పరిసరాలు, కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యలను పరీక్షించారు. వివిధ పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేసి, ఆరంభం నుంచి పట్టు సాధించాలని విద్యార్థినులకు సూచించారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ బోధనాంశాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేయాలని సూచించారు. జీసీడీవో పద్మావతి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో బాలికలకు అన్ని అంశాలపై అవగాహన అవసరమని, చట్టాల గురించి చైతన్యం కలిగి ఉండాలని అన్నారు. సమస్య ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి ధైర్యంగా తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో సరితాదేవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

హెల్మెట్ విధిగా ధరించండి...



కార్యక్రమంలో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు, పట్టణ పోలీసులు

యలమంచిలి : హెల్మెట్‌ను విధిగా ధరించాలని యలమంచిలి ట్రాఫిక్ ఎస్‌ఐ రామకృష్ణ ప్రజలకు సూచించారు. సోమవారం పట్టణంలో యలమంచిలి పట్టణ, రూరల్ పోలీసులు, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్‌ఐ మాట్లాడుతూ వచ్చే నెల నుంచి మారుతున్న చట్టాలకు అనుగుణంగా ద్విచక్ర వాహనదారులు డ్రైవింగ్ చేసే వ్యక్తితో పాటు వెనుక ప్రయాణిస్తున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు విధిగా అందరూ పాటించాలని ప్రమాదాల నివారణకు ఆరికట్టేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. హెల్మెట్ ధరించాలని నినాదాలు చేస్తూ ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో యలమంచిలి బార్ అసోసియేషన్ సభ్యులు, యలమంచిలి పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు, ట్రాఫిక్ పోలీసులు, పట్టణ పోలీసులు, ఆటోడ్రైవర్లు, ప్రభుత్వ వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మీసేవ ఆపరేటర్లను ప్రోత్సహించాలి



అడ్డురోడ్డులో సమావేశమైన మీసేవ ఆపరేటర్లు

ఎస్.రాయవరం : గ్రామాల్లో మీసేవా కేంద్రాలకు పూర్వ వైభవం రానుందని గురజాడ మండల మీసేవా అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తా ఏఎస్ బాబు అన్నారు. అడ్డురోడ్డులో సోమవారం మండల మీసేవా ఆపరేటర్లు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 15 ఏళ్లుగా మీసేవల పై ఆధారపడి బతుకుతున్న మీసేవా ఆపరేటర్లను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. సచివాలయాలు వ్యవస్థ ద్వారా ప్రభుత్వం ఆపరేటర్లను నియమించినప్పటికీ ప్రజలకు సానుకూలంగా సేవలు అందివ్వలేదన్నారు. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక మీ సేవలకు పూర్వ వైభవం తీసుకువస్తామని హామీ ఇచ్చారని, లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టుకుని నడుపుతున్న మీ సేవా ఆపరేటర్లను ప్రభుత్వం పోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ మెంబరు కర్రి జోగారావు, గౌరవ అధ్యక్షుడు ముత్తా గోవిందరావు, ఉపాధ్యక్షుడు కర్రి భూపతి, కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు, ఆపరేటర్లు నాని, వీసం రామస్వామి, శ్రీకాకుళపు జోగుబాబు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలపై అవగాహన తప్పనిసరి

రోలుగుంట: స్త్రీనిధి రుణాల మంజూరుపై స్వయం సహాయక గ్రూపు సభ్యులు అవగాహన పెంచుకోవాలని వెలుగు ఏపీఎం కె.సాధన సూచించారు. కొమరవోలు క్లస్టర్‌లోని ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సర కొత్త రుణాలపై అవగాహన కల్పించారు. సంఘ సభ్యులు ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున రుణం అందిస్తామన్నారు. సకాలంలో చెల్లింపులు జరిపే సంఘాలకు రుణాల పునరుద్ధరణలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. సంఘాల నిర్వహణను క్లస్టర్ సామాజిక కార్యకర్తలు పర్యవేక్షించి, పలు సూచనలు చేయాలన్నారు. సదస్సులో క్లస్టర్ సామాజిక కార్యకర్త నాగేశ్వరరావు, క్లస్టర్ పరిధి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి నిధులివ్వండి

మునగపాక : ఏళ్ల కాలం నాడు నిర్మించిన రహదారుల స్థానంలో కొత్త రహదారుల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు సోమవారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతి పత్రం అందజేశారు. తమ గ్రామంలో 40 సంవత్సరాల క్రితం నిర్మించిన రహదారులు నేడు శిథిలావస్థకు గురయ్యాయని అలాగే ఈ రహదారులపై రాకపోకలు సాగించే దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణులు అవస్థలు పడుతున్నారని వినతిలో పేర్కొన్నారు. అలాగే జనాభాకు అనుగుణంగా పాత రహదారుల స్థానంలో కొత్తవి నిర్మించేందుకు అవసరమయ్యే నిధులు మంజూరు చేయాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్త

మునగపాక : సీజన్‌లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఈవోఆర్డీ వెంకటలక్ష్మి కోరారు.సోమవారం సాయంత్రం పంచాయతీ కార్యదర్శులతో ఆమె మండల పరిషత్ హాలులో సమావేశమయ్యారు. సీజన్‌లో కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామాల్లో రోగాలు సోకకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

135 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం

రోలుగుంట: మండలంలో పండ్ల తోటల పెంపకానికి రైతుల నుంచి 135 ఎకరకాల భూమిని సేకరించినట్లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో కోసూరి సూర్యమణి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో తమ శాఖ ద్వారా చేపడుతున్న పనులు, ప్రతిపాదనలను మీడియాకు వివరించారు. పంట భూముల గట్లపై కొబ్బరి మొక్కలు నాటడం, మండలంలోని పంచాయతీల్లో పంట కాలువల కోసం ఆయా గ్రామాల రైతుల నుంచి నివేదికలు తీసుకున్నట్లు తెలిపారు. దీనిపై తమ శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. త్వరలోనే వీటికి సంబంధించిన పనులు చేపడతామన్నారు.

వృత్తి నైపుణ్యంతోనే ఉన్నత శిఖరాలకు



వృత్తి నైపుణ్య శిక్షణ పూర్తి చేసిన యువతి సత్కరిస్తున్న సమంత్‌కుమార్‌రెడ్డి

అనకాపల్లి : నిరుద్యోగ యువత సమయాన్ని వృథా చేసుకోకుండా వృత్తిలో నైపుణ్యం సాధించాలని నాబార్డ్ డీడీఎం సమంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక భారతీయ స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. వరల్డ్ యూత్ స్కిల్ డేను పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుందన్నారు. దాన్ని వెలికి తీసినప్పుడు మనిషి ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరు స్వయం ఉపాధితో అభివృద్ధి సాధించాలన్నారు. అనంతరం గతంలో సంస్థలో శిక్షణ పొంది స్థిరపడిన యువతను సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎస్‌బీఐ ఎల్‌డీఎం శ్రీనివాసరావు, సంస్థ డైరెక్టర్ బి.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ



విచారణ నిర్వహిస్తున్న అధికారులు

పాయకరావుపేట : శ్రీరాంపురం ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ నిర్వహించడం జరిగిందని ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్ తెలిపారు. గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు సంబంధించి ఆడిట్ తనిఖీల్లో రూ.37 వేలు నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేసినట్టు తేలిందన్నారు. బృందం నిర్వహించిన గ్రామసభకు గాని, ప్రజా వేదికకు గానీ ఫీల్డ్ అసిస్టెంట్ హాజరు కాలేదన్నారు. కానీ నిధులు ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా రికవరీ చేయించడం జరిగిందన్నారు. గ్రామసభ ద్వారా మరోసారి అతనిపై అధికారుల ఆదేశాల మేరకు విచారణ నిర్వహించడం జరిగిందని ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్ తెలిపారు. ఈ సమావేశంలో ఏపీవో హేమలత, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కృష్ణావతారంలో జగన్నాథుడు



మునగపాక జగన్నాథ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మునగపాక : మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామి సోమవారం కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. 17వ తేదీ ఏకాదశి పర్వదినం సందర్భంగా పండగను ఘనంగా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా సప్తాహ ప్రారంభం

మునగపాక: గురు పౌర్ణమి వేడుకల్లో భాగంగా స్థానిక సాయిబాబా ఆలయంలో సోమవారం సప్తాహ కార్యక్రమం సర్పంచ్ దిమ్మల అప్పారావు ప్రారంభించారు. ప్రతి రోజు సాయి కీర్తనలతో పాటు భజన కార్యక్రమం జరుగుతుందని, 21న అన్న సమారాధన జరుగుతుందని ఆలయ నిర్వాహకులు బొడ్డేడ వీరేంద్ర తెలిపారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కొత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలోని కొత్తూరు గ్రామంలో దిమిలీ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డయేరియా, డెంగ్యూ వ్యాధుల నివారణపై సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు బాల శ్రావణి మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అందువల్ల ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. ఆరు బయట ఆహారాన్ని తీసుకోవద్దన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకుని, దోమలు నివారించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ చాందిని, కుమారి రేష్మ,ఆశా కార్యకర్తలు చిట్టమ్మ, రామలక్ష్మి పాల్గొన్నారు.